ట్యూటర్

"వాణీ dear!"

"yes, జోయ్ dear!"

"ఇది విని ఏమిటో చెప్పగలవా?"

"కొత్త L. P. కొన్నావా? ఏదీ వెయ్యి. .. Sound of Music! ఆ మాత్రం తెలుసుకో లేననుకున్నావా? మళ్ళీ beginning నుంచీ వెయ్యి!"

వాణి టెలిఫోనుకు అంటుకుపోయింది.

జోయ్-అంటే జయరాం-దగ్గిర Hatari, My Fair Lady, Cleopatra మొదలైన పిక్చర్ల మ్యూజిక్ బోలెడంత వుంది.

వాణీ, వాణీ బ్రదర్స్ జోయ్, జోయ్ సిస్టర్స్ మక్, మక్ బ్రదర్స్ అండ్ సిస్టర్స్-వీళ్ళంతా కలిసి ఒక smart set. వీళ్ళతండ్రులు లక్షలు సంపాదించే వాళ్ళు. వాళ్ళ జీవితంలో ఉత్సాహోద్రేకాలు సముద్రపుకెరటాల్లాగా అనుక్షణమూ వస్తూ పోతుంటాయి. వాళ్ళ హీరోలు beatles, వాళ్ళ ఆదర్శ సాహిత్యం Play-boy, Femina, Readers Digest మరీ మేధావులు చదివి జీర్ణించుకునేది.

అరగంట అయాక వాణి, "ఇక పెట్టేస్తాను dear. మా tutor వచ్చే వేళయింది. Deadly bore కాని duty's duty, Cheerio!" అంటూ టెలిఫోన్ పెట్టేసి తల ఎత్తి చూసేసరికి, "deadly bore" రాజశేఖర్ గదిలో ఓ మూల కూర్చొని ఏదో రాసుకుంటున్నాడు.

ఎవరూ చూడకపోయినా అలవాటు ప్రకారం వాణి నవ్వుకొంటూ నాలుక కొరుక్కున్నది.

"Sorry, teacher! Kept you Waiting" అన్నది వాణి. చెంగు చెంగున దూకుతూ వచ్చి అతను కూర్చున్న కుర్చీ పక్క సోఫాలో కూలబడుతూ. సోఫాల్లో కూలబడటమూ వాటిల్లోంచి చెంగున ఎగరటమూ వాణీకి చాలా ఇష్టం.

"ఫరవాలేదు వాణీ. నేను నాసొంతపని చూసుకుంటున్నాలే. At your expense."

వాణి serious ఐపోయి, Protest చేస్తున్నట్టుగా, "మీరెప్పుడూ డబ్బు గురించే ఆలోచిస్తారేం, టీచర్?" అన్నది.

శేఖర్ చాలా slow fade - in లాగా నవ్వుతూ, నీబోటి charming girl కు డబ్బు కోసం ట్యూషన్ చెప్పాలిసిన గతి నీకు పట్టిందనుకో, నువ్వూ

డబ్బు గురించే ఆలోచిస్తావు. అరగంట waste అయింది. నీ పుస్తకాలు తెచ్చుకుంటావా? నా కవతల అయిదు గంటలకు engagement ఉంది. లేకపోతే ఇబ్బంది లేకపోను."

"I' m so so....rry, teacher. అవతల ఓ ఫ్రండ్ Sound of Music వినిపిస్తున్నాడు. మీరు పిక్చర్ చూశారా, టీచర్?"

"లేదు. నేను afford చెయ్యలేనంటే నువు Protest చేస్తావు— మళ్ళీ డబ్బుమాటే ఎత్తుతున్నానని?"

"తప్పక protest చేస్తాను. మీ కేమన్నా డబ్బు ఇబ్బందుంటే చెప్పరాదా, టీచర్?"

"చెప్పకూడదు, వాణీ. నాబోటివాడు charity తీసుకోకూడదు. నా అవసరాలకు సరిపడే డబ్బు సంపాదించుకునే శక్తి నాకున్నది. అవకాశాలే లేవు. ఎందుకు లేవో కూడా నాకు తెలుసు."

'ఎందుకు లేవు, teacher?'

"నాబోటివాడు చెయ్యవలసిన పనులు నాకన్న cheap fellows చేసేస్తున్నారు. Bad coin good coin ను circulation నుంచి తోసేసినట్టు Gresham's Law! అదో కారణం."

"ఇంకా?"

"Charity మీద బతికేవాళ్లు too many గా ఉంటున్నారు ప్రపంచంలో. సొసైటీకి useful గా ఉండేవాళ్ళు ఆర్జించవలసిన డబ్బు ఆ chanel లో పోతున్నది. అదో కారణం."

"చూశారా, teacher? మీరు డబ్బు గురించే ఇంతసేపూ మాట్లాడుతున్నారు!" అన్నది వాణి తన పాయింటు నెగ్గించుకున్న ఉబలాటంతో.

శేఖర్ చుట్టూ కలయజూసి, "ఈ గదిలో డబ్బుకు దొరకనిది ఒక్కటికూడా లేదు. నీకో కోపం రాకుండా ఉంటే ఈ గదిలో ఉన్నవాటన్నిటిలోకి చవక అయింది నా బుర్రే!" అన్నాడు.

వాణి కాస్సేపు సోఫామీద పైకీ కిందికీ ఎగిరి, "మీరింతకుముందేమిటి రాస్తున్నారు?" అన్నది.

"రాయటం కాదు, తిరగరాస్తున్నాను. నాటకం అయిదుగంటలకు రిహార్సల్ ఉంది!" అంటూ శేఖర్ గడియారం చూసుకున్నాడు.

"అయితే మీరు నాటకాలు రాస్తారా?" అన్నది వాణి ఆశ్చర్యంగా.

"నాటకా—లూకాదు, నాటకం అను. ఇది నా మొదటి నాటకం."

"ఇది రాసినందుకు మీకేమిస్తారు, టీచర్?"

"ఇచ్చేందుకెవరున్నారు? నాటకం ఆడేవాళ్ళకుక్కూడా ఏమీ ఇవ్వరు, ఇదంతా worthless activity."

"నాటకం ఓవేళబాగుంటే అప్పుడు మీకు Plenty of money! Plenty of name, fame! అవునా టీచర్?"

శేఖర్ మళ్ళీ తన చిరునవ్వును slow fade-in చేశాడు. ఏమీ అనలేదు.

* * *

వాణి ఉండే ప్రపంచం వేరు, శేఖర్‌ది వేరు. ఈ రెండూ ఎక్కడా అంటవు. ఆఖరుకు వాణి స్టడీ రూమ్‌లో కూడా ఒకదానికొకటి సమీపంగా వస్తాయిగాని వాటి మధ్య స్పర్శలేదు.

వాణికి జీవితం ఒక variety programme. గడిచే క్షణమే ఆమెకు focus లో ఉంటుంది. బీదవాళ్ళు కష్టాలు పడతారనీ, దారిద్ర్యం ప్రపంచంలో ఉందని వాణికి తెలుసు. కాని అటువంటి విషయాలను గురించి ఆమెకు గలిగే భావాలు, ఏ సినిమాలోనో, నవలలోనో పాత్రలు అనుభవించే కష్టాల మూలాన కలిగే లాంటివే. అవి ఆమెలో ఒక ప్రత్యేక చైతన్యాన్ని కలిగించవు. తనకు సమీపంలో ఉండే నౌకర్ల ఆర్థిక చిక్కులను తాను ఎంత సులువుగా పరిష్కరించ గలదో ఆమెకు తెలుసు. అందుచేత ప్రపంచంలో ఉండే అసహాయుల సమస్య ఆమె కొక పెద్ద సమస్యగా కనిపించేది కాదు.

వర్కర్లూ, సమ్మెలూ, గలాటా, వాళ్ళ విప్లవాలూ, వాళ్ళ రాజకీయాలూ, సోషలిస్టులూ, కమ్యూనిస్టులూ—ఇదంతా ఒక ఉన్మాదమని వాణి తన మనసులో నమ్మేది. వాటిని గురించి అట్టే ఆలోచించేది కాదు.

జీవితం సబ్బునీళ్ళలాంటిది. అట్టడుగున మురికి, దానికి ఎగువగా నీరు, ఇంకా ఎగువన బుడగలు. వాణి వంటివాళ్ళు ఆ బుడగల మధ్య జీవిస్తారు. జీవితం రంగురంగులుగా, అందంగా ఉంటుంది. కాని అందులో సారం చాలా తక్కువ. వాణికి ఏ జీవిత సమస్య గురించీ ఏమంత తెలీదని చెప్పొచ్చు.

ఆఖరుకు ప్రేమను గురించికూడా ఆమెకు చెప్పుకోదగినంత నమ్మకం లేదు. Fun! జీవితంలో fun చాలా ఉంది. Young men nice గానూ naughty గానూ ఉంటారు. కొందరు nice గా మాట్లాడి, naughty గా ప్రవర్తిస్తారు. మరి కొందరు naughty గా మాట్లాడుతారు గాని, వాళ్ళ ప్రవర్తన nice గా ఉంటుంది. కొందరు bold గా ఉంటారు. కొందరు పిరికివాళ్ళు. వాణి తనకుతాను average కింద వేసుకున్నది. ఆమె స్నేహితురాళ్ళలో కూడా bold గానూ, naughty గానూ ఉండేవాళ్ళున్నారు. Girls ను kiss చెయ్యటానికి young men రకరకాల వంకలు కనిపెడతారు. అందులో కొందరు clever, కొందరు crude కాని అదంతా fun.

ఒక్కటి నిజం. ప్రేమకూ, పెళ్ళికి ఏమీ సంబంధం లేదు. ఈ విషయం lower middle class కుండే భ్రమలు upper middle class కుండవు. వాణికి అటువంటి భ్రమ లేమీ లేవు. వాణి జౌళి పరిశ్రమను పెండ్లాడ బోతున్నది. ఆమెకు కాబోయే భర్తను నిర్ణయించిన శక్తులేవో ఆమెకు తెలీదు. అవి వర్తమాన పారిశ్రామిక సాంఘిక రాజకీయాలకు సంబంధించినవి.

కిందటి spring లో వాణిని చేసుకోబోయే వాడు వచ్చాడు. వాణితో చాలా nice గా behave చేశాడు. Kiss చెయ్యాలని కూడా ప్రయత్నించలేదు. Engagement ring తో బాటు ఒక sweet little watch కూడా present చేశాడు.

వాణి అతన్ని తన set లో అందరికీ present చేసింది. అది మంచి gala party. అయితే అందరూ proper గా behave చేశారు. అతను ఎలా ఉన్నాడని formal గా అందర్నీ అడిగింది.

"Wooden" అన్నాడు జోయ్.

సహజంగా వాణి తన కాబోయే భర్తను defend చేసుకున్నది.

Pharmaceuticals కూ, textiles కూ పెళ్ళి జరిగేటప్పుడు, మనమూ మనమూ మాట్లాడుకున్నట్టుగా కట్నాలు మాట్లాడుకోరు. కాని కాబోయే భర్త వాణిని ఒక విషయం personal request చేశాడు; వాణి బాగా హిందీనేర్చుకోవాలి. జౌళి పరిశ్రమ చేసే విజ్ఞాపన ఆజ్ఞతో సమానం.

అందుకే ఈ ట్యూషన్. శేఖర్ వాణికి హిందీ నేర్పటానికి ప్రయత్నిస్తున్నాడు.

వాణి ఆ హిందీని slow motion లో నేర్చుకుంటున్నది. తనకు ఎంత హిందీ వచ్చిందన్నది ఆమెకు ప్రదానంగా కనపడలేదు— హిందీ నేర్చుకోవటానికి ఎంత ఖర్చు చేశామన్నదే తన effort కు కొలబద్ద అని ఆమె భావించింది.

ఇప్పటికామె వెయ్యి రూపాయల హిందీ నేర్చుకున్నది. Note చేసుకోండి కావలిసే.

శేఖర్ శషభిషలు పనికిరాని మనిషి. అతనికి సార్థకంగా బతకాలన్న ఆశయం తప్ప మరే ఆశయమూ లేదు. "అర్థం" అంటే డబ్బు అనే అర్థం కూడా ఉన్నదని జీవితం అప్పుడప్పుడూ జ్ఞాపకం చేస్తూ ఉంటుంది. అప్పుడతను చిరాకు పడతాడు. డబ్బంటే అతనికి గౌరవం లేదు. కాని డబ్బు అవసరం ఉన్నది. తనకే పుష్కలంగా డబ్బుంటే తాను చేయదలచుకున్న పనులు మరింత హాయిగా చేసుకొని ఉండేవాడని అతను ఒకప్పుడు అపోహ పడ్డాడు. కాని ఆ అపోహ తొలగిపోయింది. డబ్బు పుష్కలంగా ఉండి దాన్ని ఖాతరు చెయ్యనివాళ్లు ఏ ఆశయమూ లేకుండా

జీవిస్తున్నారు. లేదా, మరింత డబ్బు సంపాదించటమే జీవిత లక్ష్యంగా జీవిస్తున్నారు.

అర్థ సాధనకే కృషి చెయ్యాలి. కృషిచేసి మన ఆశయాలకు అనుగుణంగా ఉంటే, దాని ద్వారా ఎంత డబ్బు వచ్చినా చింతించరాదు. ఏమీ రాకపోయినా విచారించరాదు. శేఖర్ ప్రస్తుతం ఆ దృక్పథంలో ఉన్నాడు.

అతని ఆశయం నాటకాలు రాయటం. అతను ఇంగ్లీషులోనూ, హిందీలోనూ, తెలుగులోనూ అనేక నాటకాలు చదివి, ఒక నిర్ణయానికి వచ్చాడు. నాటకాలను అనువదించటం వృథా. షేక్స్పియర్ నాటకాలు గాని, షా నాటకాలు గాని తెలుగులోకి అనువదిస్తే తెలుగు నాటకాలు కావు. ఏ జాతికి కావలసిన నాటకాలు ఆ జాతి, తన భాషలో సృష్టించుకోవాలి. కవిత్వం అనువదించటమే నిరుపయోగం. నాటకానువాదాలు ఇంకా నిరుపయోగం.

శేఖర్ ఏడాదినుంచీ ఒక నాటకం రాస్తున్నాడు. అది ఇటీవలనే ఒక రూపం దాల్చింది. ట్రూప్ అందుబాటులో లేనివాళ్ళు నాటకాలు రాయగూడదు. వాటిని ఎవరు ఆడతారు ? రిహార్సల్స్‌తోబాటు రచన సాగుతూనే ఉండాలి. చదవటానికి బాగున్నట్టుండి మాట వినటానికి ఇంపుగా ఉండకపోవచ్చు. కథల్లో అతను చాలా భయంకరమైన సంభాషణలు చూశాడు. వాటిని ఎవరన్నా నోట అంటే తప్ప, ఎంత చెత్తగా ఉన్నదీ తెలీదు. నాటకంలో అటువంటి సంభాషణ మచ్చుక్కూడా ఉండగూడదు.

నాటకాలూ, రిహార్సల్సూ శేఖర్‌కు కొత్త కాదు. అతను రేడియోకూ, విద్యార్థులు ఆడటానికీ నాటకాలు రాశాడు విద్యార్థులచేత రిహార్స్‌చేయించాడు కూడా. అయితే సంపూర్ణమైన స్టేజి నాటకం రాయటమూ, స్టేజి అనుభవంగల ఎమెచూర్ నటులచే రిహార్స్ చేయించటమూ ఇదే మొదలు.

రిహార్సల్ అతను అనుకున్నదానికన్న బాగానే జరిగింది. ఒక నటుడూ, ఒక నటీ బొత్తిగా miscast గా కనిపించారు. వాళ్ళు తమ పాత్రలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించినట్టు కూడా లేదు. ఆ నటుడి వాచికం ఘోరం. చాలా బరువుగా మాట్లాడుతున్నాననుకొని "అ- మామగారూ అ—పార్వతిని అ—మీయింటివద్దనే ఉండనివ్వండి." అన్న ధోరణిలో మాట్లాడతాడు. ఏనాడో శేఖర్ పుట్టక పూర్వం స్టేజిమీద ముఖ్యపాత్రలు ధరించే చౌకబారు నటులంతా అట్లాగే మాట్లాడేవారుట. నటుడుగా పేరుమోసిన శేఖర్ పెత్తండ్రి వాళ్ళను imitate చెయ్యటం శేఖర్‌కు బాగా జ్ఞాపకం.

అసలే నాటక ప్రదర్శనం తుమ్మితే ఊడే ముక్కులాగుంది. నటులంతా ఔత్సాహికులు. వాళ్ళు ప్రస్తుతానికి డబ్బు అడగటంలేదు. ఈ నాటకం ఆర్థికంగా విజయవంతం కావటమూ, నటులకు తృణమో, పణమో ముట్టటమూ అనేది ప్రస్తుతానికి పగటికలే. అటువంటప్పుడు శేఖర్ నటులను మార్చాలని పట్టుబడితే ఏం బాగుం

టుంది ? వాళ్ళను సరిదిద్దటానికే అతను జంకుతున్నాడు.

"చూడండి. సూర్యంగారూ, 'మావగారూ' అనండి. 'మామగారూ' అంటే నోటి మాటగా వినిపించటంలేదు." అన్నాడు శేఖర్.

సూర్యంగారు కాస్త offend అయినట్టు కనబడ్డాడు.

"ఇక్కడున్నట్టు చదువుతున్నాను. మార్చి చదవమంటే అలాగే చదువు తాను ...మ్ ... మామగారూ ! "

చదివేస్తే ఉన్నమతి పోయిందన్నట్టయింది. శేఖర్ అతని ఉచ్చారణ భారాన్ని దేవుడికి వదిలేశాడు.

ఆ స్థితిలో మరో నటుడు దేవుడల్లే అడ్డుపడి, "మామ్మగారూ ఏవిట్రా ? మామూలుగా మాట్లాడినట్లు, మావగారూ అనలేవూ ?" అని సూర్యంగారిని కోప్పడ్డాడు.

రిహార్సల్స్ సాగినకొద్దీ నటులు నాటకం mood లో పడ్డారు. వాళ్ళు పాత్రల మనస్తత్వాలను గురించి చర్చించుకోవటం శేఖర్ చెవిని పడింది. అది మంచి లక్షణమని అతనికి తోచింది. నటులకు నిజంగా పాత్రలలో ఆసక్తి పుట్టిననాడు నాటకం రక్తికట్టే అవకాశం ఉంది.

Miscast అనుకున్న ఆడకూతురు కూడా తన పాత్రను కొంతవరకైనా అర్థం చేసుకుంటున్నట్టు కనబడింది.

నాటకానికి కావలసిన సెట్టింగు ఒక సినీ ఆర్టు డైరెక్టరు ముడివస్తువుల ఖరీదుకు తయారుచేసి పెట్టాడు. నాటకంలో ఉండే మూడు అంకాలకూ ఒకటే సెట్టింగు.

హాలు బుక్కయింది. టికెట్లు అచ్చేశారు.

శేఖర్ కాంప్లిమెంటరీ టికెట్లు ఒక అరడజను తెచ్చి వాణికిచ్చాడు.

"మీ నాటకమే కదూ, టీచర్? ఇన్ని టికెట్లు దేనికి, టీచర్, మా ఫ్రండ్స్‌కు ఇవ్వమంటారా? Thank you very much, teacher. I heartily wish the drama success, teacher. దీనికి back-ground music ఉందా, టీచర్? మక్‌తో చెబితే ఓ electric guitar, ఓ piano, ఓ double bass, ఓ bow , drum ఏర్పాటు చేసేవాడే?" అన్నది వాణి ఉత్సాహం పొంగి పొర్లిపోతూ.

"ఇది అంత high - class production కాదులే, వాణీ! నాటకానికి వీలుంటే రండి. ఇంకా టికెట్స్ కావాలంటే అడుగు ఇస్తాను. Of course, no obligation కాంప్లిమెంటరీలిచ్చిన మాత్రాన show చూడాలని ఏమీ లేదు."

"అదేమిటి, టీచర్. తప్పక ట్రై చేస్తాను. మా friends కూడా వస్తారు." అన్నది వాణి.

"Very nice of you!"

"టికెట్స్ sold out అయ్యాయా?"

శేఖర్ నవ్వి "ఈ మహాపట్నంలో టికెట్లు sell out కావటం కూడానా? అందరికీ అంటగట్టి డబ్బు వసూలు చేస్తున్నాం. అప్పటికి ఖర్చులు గిట్టుతాయో, లేదో తెలీదు," అన్నాడు.

వాణి తన చేతిలో ఉన్న టికెట్టుమీద "patron" అని చదివి, "patrons దగ్గిర ఎంత collect చేస్తున్నారు?" అన్నది.

"ఏమీ collect చెయ్యటం లేదు. గొప్పవాళ్ళు వచ్చి ముందు వరుసల్లో కూర్చుంటే నాటకానికి status వస్తుంది. అందుకని గొప్పవాళ్ళకు కాంప్లిమెంటరీ లిస్తున్నాం," అన్నాడు serious గా మాట్లాడుతున్నట్టుగా.

"No, no I'd like to pay! అందుకడిగాను."

"Dont bother! అంతగా అయితే show అయ్యాక చూసుకోవచ్చు." అన్నాడు శేఖర్.

మొత్తంమీద నాటకం సవ్యంగానే జరిగింది. Audience reaction బాగున్నట్టే కనబడింది. హాలుకూడా దాదాపు నిండింది. Patron లు సగంమందే వచ్చారు. వాణిగాని, ఆమె friends గాని రాలేదు—వస్తారని శేఖర్ అనుకోలేదు.

మర్నాడు శేఖర్ ట్యూషన్ చెప్పటానికి వచ్చినప్పుడన్నా వాణి ఆ విషయం ఎత్తలేదు. శేఖర్ అంతకన్నా ఎత్తలేదు. ఆదివారంనాడు ఇంగ్లీషు పత్రికలో శేఖర్ నాటకంమీద writeup చిన్నది పడింది. పట్నంలోని ఇంగ్లీషు పత్రిక తెలుగు నాటకం గురించి రాయటం చాలా అపూర్వం. రాసినవి రెండు ముక్కలయినా నాటకాన్ని ఆకాశాని కెత్తేశారు.

సోమవారంనాడు శేఖర్ రాగానే వాణి, "I'm so sorry, teacher ఆ రోజు నేను మీ నాటకానికి రానేలేదు. I clean forgot about it! చాలా బాగా review చేశారే! చూశారా?" అని million volt ల ఉత్సాహంతో అడిగింది.

"చూశాను, ఎవరో sympathiser రాసి వుంటాడు." అన్నాడు శేఖర్.

తెలుగు పత్రికలు కొంచెం దీర్ఘంగానే రాసి మెచ్చుకున్నాయి గాని, ఆ మెచ్చుకోలు చాలా కృత్రిమంగా ఉంది. ఒక పత్రిక ఆ నాటకం ఎట్లా ఉంటే ఇంకా బాగుండేదో కూడా చెప్పింది!

నాటక ప్రదర్శనంవల్ల నష్టమేమీ రాలేదు. ఇంకో ప్రదర్శనం వేసి ఇంత డబ్బూ వసూలు చేయగలిగితే నటులందరికీ తలా ఒక పాతిక రూపాయలూ మిగిలే టట్టు కూడా కనబడింది. మూడో ప్రదర్శనందాకా శేఖర్ తానేమీ కోరలేదు.

వాణి సహజంగా ఆ నాటకం గొడవ అప్పుడే మరచిపోయింది. కాని ఆ నాటకం ఆమెను వదల లేదు.

ఆ వారంలోనే ప్రొడ్యూసర్ మాధవన్ కూతురు వచ్చి, "కిందటి వారం ఒక తెలుగు డ్రామా చూశాను. అది రాసినది మీ హిందీ ట్యూటరుట కాదూ? Picturise చెయ్యటానికి మంచి theme. Daddy కి చెప్పాను. Wonderful possibilities!" అని తెగ పొగిడింది. ఆ అమ్మాయి తననే పొగడుతున్నంత గర్వంగా ఫీలయింది వాణి. ఆ రోజు శేఖర్ రాగానే ఆ శుభవార్త అతనికి అందించింది. శేఖర్‌లో చలనం లేదు.

"మాధవన్ మీ నాటకం పిక్చర్ తీస్తే మంచి ఛాన్స్, టీచర్! ఏమంటారు? I would befine fine!....మీరేమీ excite కారేం, టీచర్?"

Slow fade-in నవ్వు పెట్టి శేఖర్, "Excite అయి ఏం చేయను? చిన్న dance చేయనా?" అన్నాడు.

"You're the limit!" అని వాణి కోప్పడింది.

త్వరలోనే ప్రొడ్యూసర్ మాధవన్ శేఖర్ కోసం కబురు పెట్టాడు. ఆయనకు తెలుగు బాగా వచ్చును. శేఖర్ రాసిన నాటకమంతా చదివించుకు విన్నాడు. పక్కన తన script-writerను కూర్చోబెట్టుకొని మరీ విన్నాడు. Script-writer అర్థం చేసుకోలేని సంభాషణలు అరవంలో చెప్పాడు.

ఆ తరవాత నెలరోజులకు మళ్ళీ శేఖరుకు కబురు వచ్చింది. మాధవన్ ఆతని నాటకాన్ని అరవంలోనూ, తెలుగులోనూ తీయదలచుకున్నాననీ, అయిదు వేలిస్తాననీ, కథలో మార్పులు చేస్తాననీ అన్నాడు.

"హిందీలో తీసేటప్పుడు నేను సహాయ పడగలను. నాకు హిందీ బాగా వచ్చును. హిందీ పేపర్లకు వ్యాసాలూ అవీ రాస్తుంటాను" అన్నాడు శేఖర్.

"తప్పక పిలుస్తాను." అన్నాడు మాధవన్.

మర్నాడు శేఖర్ రాగానే, "Congrats, teacher, మంచి ఛాన్స్ కదూ? Nice publicity! Good income! కదూ?" అన్నది వాణి. అయిదువేల రూపాయలు ఒక్క పూటలో, ఒక్క పార్టీకి ఖర్చుపెట్టగల వాణి తమదగ్గర నెలకు నూరు రూపాయలు పుచ్చుకునే శేఖర్ దృష్టినుంచీ అయిదువేలు పెద్దమొత్తం అవుతుందని ఊహించ యత్నించింది. యాభై నెలల జీతం!

"నేనాసంగతి ఆలోచించలేదు. నా కథతో మాధవన్‌గారు ఏ అయిదులక్షలో సంపాదించాలని ఆశపడుతూ ఉండవచ్చు. పేరుకు ఆయన ప్రొడ్యూసర్. కాని ఆయన సంపాదించిన లక్షలన్నీ produce చేసి పెట్టినవాళ్ళు పైవాళ్ళు, నాబోటివాళ్ళు." అన్నాడు శేఖర్.

"ఏ industrialist ఐనా అంతే. మా ఫాదర్‌కూడా అంతే!" అన్నది వాణి.

"అదే నేనూ అనేది."

"కానీ వాళ్ళు తీసుకొనే risks మాటేమిటి?"

"ఎక్కువ risk తీసుకుంటే వాళ్ళను గురించి industrialistsగా ఎవరూ చెప్పుకోరు. నేనే పేరున్న వాణ్ణయితే ఆయన అయిదువేలిస్తా ననటానికి సాహసించే వాడా? నన్నడిగితే robbory అంటాను. Daylight robbory."

అతనన్నది ప్రొడ్యూసర్ మాధవన్ గురించి అయినా వాణికి కోపం వచ్చినట్టు కనపడింది.

"అలా అనుకుంటూ ఆ amount కు ఎందుకొప్పుకున్నారు, టీచర్?" అన్నదామె.

Necessity. నాబోటి వాళ్ళకు necessity అనేది ఒకటుంది, sister. ఒక్క విషయం అడుగుతాను. నాకు మీ daddy నెలకు నూరు రూపాయలిస్తున్నారు. ఈ ట్యూషనే యాభై రూపాయలకు చెప్పటానికి సిద్ధంగా వుండేవాళ్లున్నారు కనక నాకు మీరు overpay చేస్తున్నారనాలి. అచ్చా! నేను రోజుకు ఎన్ని ట్యూషనులు చెప్పగలను? మహాచెబితే మూడు చెప్పగలను. అందరూ generousగా వంద వంద యొప్పున యిస్తే నేను నెలకు మూడు వందలు సంపాదిస్తాను. Do you think it is a decent Income? you dont! అయితే నూరు రూపాయల ట్యూషను ఎందుకు accept చేశాను? Necessity! By the way నాకు ఇంకే ట్యూషన్లూ లేవు. ఈ ఎనిమిది నెలలనుంచీ నూరు రూపాయల మీదనే నేను సంసారం ఈదుకొస్తూ ఉండి వుండొచ్చు. కాని అది మీ concern కాదు. మీ stand-point నుంచీ మీరు generous గానే ఉన్నారు కాని నేను in theory, free agentను. ఎవరిదగ్గరికో వెళ్ళి, 'నాకి సంపాదన చాలటంలేదు,' అని చెప్పుకోవటానికి లేదు. నేను survive కావాలంటే exploitationకు ఒప్పుకోవాలి. అందుకే ప్రొడ్యూసర్ మాధవన్ ఇచ్చిన చెక్‌ను thankful గా స్వీకరించాను. అదీ ఉన్న విషయం" అన్నాడు.

"Principle of free enterprise" అని వాణి ఏదో చెప్పబోయింది. కాని శేఖర్ అడ్డు తగిలాడు.

"ఈ ఫ్రీ ఎంటర్ ప్రయిజ్ classes మధ్యనేగాని, వ్యక్తులమధ్య లేదు. ఆ సంగతి నేను వేరే చెప్పనవసరంలేదు. నేను poor man అయితే నా భార్య poor woman అవుతుంది. నా పిల్లలు poor kids అవుతారు. నేను rich man అయితే, నా భార్యా, పిల్లలూ rich people అవుతారు. అందువల్ల free enterprise వెంటనే ఒక విధమైన కమ్యూనిజం కూడా వున్నది. Free enterprise భాగ్యవంతులనూ, బీదవాళ్ళనూ వేరు వేరు ప్రపంచాలలో ఉంచుతుంది. కమ్యూనిజం డబ్బునూ, దారిద్ర్యాన్నీ ఆ ప్రపంచాలలో సమంగా పంచుతుంది. ఇందులో పెద్ద secret ఏమీలేదు. Upper class communismలో అందరూ తమ అవసరాలను

overfulfill చేసుకుంటారు. Lower class communism లో తిండీ, బట్టా, మందులూ, educationకూడా ఉండవు. You simply have no idea what it is to starve-literally starve! నాకు తెలుసును. నేను చాలాసార్లు తిండి లేకపస్తులున్నాను."

వాణి సీరియస్‌గా ఆలోచించి, "అందుకే మీరింత bitterగా తయారయ్యారు," అన్నది.

"Bitterness is a fact of life! తిండికి మాడేవాళ్ళు ప్రపంచంలో కోట్లున్నారు. Bitterగా ఉండే హక్కు వాళ్ళందరికీ ఉన్నది."

"కావచ్చు. కాని rich people చేయగలిగిందేమిటి?"

"Plenty! పేదవాళ్ళ నుంచి వాళ్లు ఆత్మరక్షణ చేసుకోవలసి వుంటుంది. రాజకీయ శక్తులను తమ అధీనంలో ఉంచుకోవాలి. పోలీసులనూ, తుపాకులనూ పేద వాళ్ళమీద freeగా ఉపయోగించాలి. Lifeను గురించి నిజంచెప్పే వాళ్ళను జైళ్ళలో కుక్కాలి. Democracy గురించి అబద్ధాలు ప్రచారం చేయాలి. ఏనాడు democracy అచ్చిరాదని తోస్తే ఆనాడు దాన్ని పక్కకు నెట్టెయ్యాలి. పరిస్థితి మరీ విష మిస్తే దేశాన్ని డిక్టేటర్ల చేతిలో పెట్టాలి. Bourgeois democracy డిక్టేటర్ షిప్‌నూ, మత మౌఢ్యాన్నీ ఆమోదించదు. కాని last analysis లో కమ్యూనిజం కంటె వాటినే బూర్జువా డెమోక్రసీ prefer చేస్తుంది; అమెరికా free country—కాని ప్రపంచంలో ఎక్కడ నియంతృత్వం ఉన్నా అమెరికా దాన్ని బలపరచటానికి ముందుకు వస్తుంది. That is capitalist democracy for you!" అన్నాడు శేఖర్. ఆరోజు పాఠం సాగలేదు.

* * *

వాణికి పెళ్ళయింది. ఆమె తన భర్తతో కాన్పూరుకు వెళ్ళిన రోజుల్లో భార్యా భర్తలు ఒక హిందీ పిక్చరుకు వెళ్ళారు.

టైటిల్సు చూస్తున్న వాణి అకస్మాత్తుగా "Why, that was my tutor," అన్నది.

శేఖర్ కథను హిందీలో కూడా తీశారు.

"నిజమా?'' అన్నాడు వాణి భర్త.

"Of course! చాలా nasty man! అతనికి rich class అంటే చాలా కోపం. Envy ఎప్పుడూ కమ్యూనిజం మాట్లాడేవాడు.'' అన్నది వాణి.

"ఈ పిక్చర్‌కు బాగా డబ్బు తీసుకుని వుండాలే ?" అన్నాడు భర్త.

"Oh yes ప్రొడ్యూసర్ మాధవన్ ఆయన్ని పిలిచి, ఉత్త storyకి five thousand ఇస్తే, దోపిడీ అన్నాడు. పస్తులుండేవాట్ట ! తనే చెప్పాడు. అటువంటి వాడు, అయిదువేలిస్తే తన stars ను thank చేయక rich people రాక్షసు లన్నట్టు లెక్చరిచ్చాడు !"

"ఈ కమ్యూనిస్టులంతా అంతే ! **Skunks !** **Bastards !** వాళ్ళకు **culture** ఏ కోశానా లేదు. **Kill off the commies,** ఈ దేశం బాగుపడు తుంది !" అన్నాడు వాణి భర్త.

ముద్రణ : సంవేదన (త్రైమాసిక) జూలై, 1968

[ఇంగ్లీషు మాటలను, వాక్యాలను విశేషంగా రచయిత వాడారు. కథా వాతావరణ చిత్రణలో భాగం ఇవి. ఈ కథలో చిత్రించిన వాతావరణం లాంటిది కొ. కు. ఇతర కథల్లో లభించదు. కొత్త వ్యాపారవర్గ సంస్కృతిని సన్నిహితంగా పరిశీలించినట్లు ఈ కథ ఒక దాఖలా—సంపాదకుడు]